
# ప్రభావితం

నాగభైరవ ఆంజనేయులు



ముందుకు దూసుకుపోతున్న సిటీ బస్సు తక్కున ఆగింది-ఎదురయి ఎవరో శపించినట్లు. అందులోంచి క్రిందకు దిగింది కాత్యాయిని. రోడ్డుమీద జనం కిక్కిరిసి వున్నారు - నిలబడి మాట్లాడుకుంటున్నవారు మాట్లాడుతూ నడుస్తున్నవారు. కాత్యాయిని 'ఫెమినా ఫాన్సీ సెంటర్' కేసి నడిచింది. వీథి

కిరువైపులానున్న షాపుల్లో ఆకర్ష ణీయంగా అమర్చిన వస్తువులు మెర్క్యురీ విద్యుద్దీపకాంతిని అద్దు కుంటూ తమ అందాలకు మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఫాన్సీ సెంటర్ గుమ్మంలో – లోనికి పోబోతున్న కాత్యా యిని, బయటకు వస్తున్న కల్పన ఒకర్ని చూసి ఒకరు ఆశ్చర్యపోయారు.

"హాయ్—కాత్యాయినీ."

"ఓ—కల్పనా."

ఇద్దరూ ఒకేసారి ఆనందంతో విస్తు బోతూ అన్నారు. నిండుగా నవ్వు కున్నారు.

"ఏంపనిమీద వచ్చావ్ ఈ భాగ్య నగరానికి ? ఎప్పుడు రాక ?" ప్రశ్నిం చింది కల్పన.

"పనిమీద రావటమేమిటి ! ఉండటం ఇక్కడే" అని చెప్పి, "మరి నీ వెప్పు డొచ్చావ్ ?" అంటూ ప్రశ్నించింది కాత్యాయిని.

"బాగుంది. ఈ నా నగర జీవితానికి మూడేళ్లు నిండి రెండు నెలలయింది" అంది పల్చగా నవ్వుతూ.

అన్నేళ్లుగా ఒకే ఊర్లో వుంటూ కలుసుకోలేకపోయినందుకు "అయ్యయ్యో" అంటూ తెగ నొచ్చు కున్నారు.

ఇప్పటికయినా కలుసుకున్నాం, 'ఇంకా నయం' అని సంతోషించారు స్నేహితురాళ్ళిద్దరూ.

ఒకర్ని గురించి ఒకరు అడిగి తెలుసుకున్నారు.

అడ్రసులు మార్చుకున్నారు.

ఆ పై ఆదివారం ఎక్కడ కలుసు కోవాలో తేల్చుకున్నారు — కాసేపు వాదించుకొని, ఆ పైన విడిపోయారు.

కాత్యాయిని, కల్పన కాలేజీలో క్లాస్‌మేట్స్. హాస్టల్లో రూంమేట్స్. ఒకర్ని విడిచి ఒకరు వుండేవాళ్ళుకాదు ఆ రోజుల్లో. శలవల్లో ఇద్దరూ కలసి ఒకసారి కాత్యాయినిగారింటికి వెడితే, మరోసారి కల్పనగారి ఊరు చేరేవారు.

"మేడ్ ఫర్ ఈచ్ అదర్" అనే వారు కొందరు వారి స్నేహానికి మురిసి పోతూ.

"లెస్బియన్స్" అనే వారు అన్యోన్య తను చూసి ఓర్చుకోలేనివారు.

చదువు పూర్తయాక— ఇద్దరిమధ్యా వుత్తరాలు, కబుర్లను మోసాయి విసుగూ, విరామం లేకుండా.

పెళ్ళిళ్ళయ్యాక — కొద్దిరోజులకే బద్ధకించిన ఉత్తరాలు పూర్తిగా ఆగి పోయాయి.

మళ్ళీ ఈనాడు కలుసుకున్నారు స్నేహితురాల్లిద్దరూ.

* * *

ఆ పై ఆదివారం, సాయంత్రం నాలు గయింది. కాత్యాయిని పతీ సమేతంగా కల్పనగారింటికి వెళ్ళింది అనుకున్న ప్రకారం. పరిచయాలు, పరామర్శలు




పూర్తయాయి. మగవాళ్ళిద్దరినీ రాజకీయాలు అంటుకోవటంతో ఆడవాళ్ళు వంటగదికేసి నడిచారు.

"మీవారి కేం ఇష్టం?" కల్పన అడిగింది.

"నేనంటే ఇష్టం." ముసిముసిగా నవ్వుతూ అంది కాత్యాయిని.

"అఘోరించావులే. తినేందుకు."

"మిరపకాయ బజ్జీలు. మిరియాల చారు."

"నీకూనా?"

"నో, అవంటే నాకు మంట."

"అయితే బజ్జీలే చేస్తాను." ఉడికిస్తూ అని, శనగపిండి డబ్బాను క్రిందికి దింపింది కల్పన.

పిండి కలుపుతూ- కలసి వున్నప్పటి కాలేజీ కబుర్లను కలబోసుకున్నారు. విడిపోయాక జరిగిన విశేషాలను వడబోసుకున్నారు.

కాల్‌గాస్‌మీద నూనె కాగుతోంది.

చీరల గురించి, కొత్తగా వస్తున్న నగల గురించి ముచ్చటించుకున్నారు.

వారి సంభాషణ 'ఉద్యోగం చేసే గృహిణుల' మీదికి మళ్ళింది. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలుగల ఇద్దరూ ఏకాభిప్రాయానికి రాలేకపోయారు ఎంతగా వాదించుకున్నా.

చర్చ ఘాటుగా సాగుతోంది.

"చదువుకున్న స్త్రీ ఉద్యోగం చేసి తీరాలి" అంటుంది కాత్యాయిని.

"గృహిణి ఉద్యోగం చేయటంవల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి" అంటుంది కల్పన.

"ఇంటిని, పిల్లల్ని చక్కదిద్దుకోవటం భారత గృహిణి ప్రథమ కర్తవ్యం. ఆ కర్తవ్య నిర్వహణకు పూర్తిగా న్యాయం చేకూర్చటం ఆమె ముఖ్యధర్మం. ఆ తర్వాతనే ఉద్యోగం గాని మరేదయినాను. ఇటు ఇంటిని చక్కదిద్దుకోవటం, అటు ఉద్యోగానికి న్యాయం చేకూర్చటం... రెండు గుర్రాల మీద స్వారీచేయటంలాంటిది. ఉద్యోగం చేసే స్త్రీలు తమ పిల్లల ఆలనాపాలనా చూడగలరంటావా ? ఆయాల పెంపకంలో పెరిగిన పిల్లలు తల్లిదండ్రుల అభిరుచులకు అనుగుణంగా వుండగలరంటావా ? సాయంత్రానికి అలసిపోయి ఇంటికి వచ్చిన భర్తకు చిరునవ్వుతో స్వాగతం పలికి స్వయంగా చేసిన కాఫీ అందించటంలోగల ఆనందం మరెవరో తయారుచేసి అందిస్తే లభిస్తుందంటావా? ఆఫీసుల్లో ఇద్దరూ అలసి తిరిగొచ్చి ఏం సుఖాన్ని అనుభవిస్తారు — డబ్బు కోసం ఒకర్ని ఒకరు మభ్యపెట్టుకోవటంగాని. విదేశాల్లో స్త్రీలు ఉద్యోగం చేస్తున్నారు అంటే అది వేరే విషయం. మనకున్న సెంటిమెంట్స్, ఆత్మీయత, అనురాగం వారికి లేవు. ఎవరి బ్రతుకులు వారివి అక్కడ. అక్కడి జీవన విధానమే వేరు." కల్పన తన అభిప్రాయాన్ని కాత్యాయిని ముందుంచింది.

"సంపాదనకోసంకాకపోయినాసరదా కోసంగాని, కాలక్షేపం కోసంగాని చదువుకున్న మనం ఉద్యోగం చేసి తీరాలి. కాల్‌గాస్‌పై, ప్రెస్టేజికుక్కర్‌తో వంటంతా గంటలో అయిపోతుంది. ఆ తర్వాత గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలి. ఉద్యోగం చేయటం ఒక తీయని అనుభూతి. మంచి అనుభవం. అది అనుభవించితేనే అర్థమవుతుంది. ఉద్యోగం చేసే గృహిణులకు ఇల్లు చూసుకునే తీరిక, ఓపిక వుండవంటారు. అది కేవలం బయటివారి అపోహమాత్రమే. నాలుగేళ్ళనుండి ఉద్యోగం చేస్తున్నా నా కెప్పుడూ ఏ ట్రబులూ రాలేదు. చూడు కల్పనా ! కష్టపడి చదివిన చదువును వంటింటికే పరిమితం చేయటం, సంపాదించిన డిగ్రీలకు చెదలు పట్టించటం — ఐ డిస్‌లైకిట్. ఇలా ఇంట్లో వుండడం నీ ఆత్మను మభ్యపెట్టుకోవటం కాదా !" కాత్యాయిని తన అభిప్రాయాన్ని నొక్కి చెప్పింది.

టిఫిన్ పూర్తవటంతో చర్చ అంతటితో ఆగిపోయింది.

* * *

కాత్యాయిని మనసు ఆలోచనలతో ఉడికిపోతుంది. కల్పన మాటలు పదే పదే గుర్తుకు రాసాగాయి. ములుకుల్లా గుచ్చుకుంటున్నాయి. మనసుని చెద పురుగులా తొలిచేస్తున్నాయి. తాను

ఉద్యోగం చేయటంవల్ల తన భర్తకు అసంతృప్తి కల్గిస్తుందా? ప్రతి మగాడూ కోరుకునే ఆనందం తాను కలిగించలేక పోతుందా ? పిల్లలు - ఏంతింటున్నారో, ఎలా వుంటున్నారో, ఏం చదువు తున్నారో ? కల్పనలా ఇంటిపట్టున వుండి అన్ని పనులూ స్వయంగా చేసు కుంటే తృప్తిగా వుంటుందేమో ! తాను ఉద్యోగం చేయటంవల్ల నెలకు మూడొం దలు సంపాదిస్తుందేగాని, దానికి మించిన కనుపించని నష్టాన్ని తాను గ్రహించటం లేదు.

రోజంతా ఇవే ఆలోచనలు కాత్యా యినిని పీక్కుతింటున్నాయి.

* * *

మేడ పైభాగంలో వుంది "యునై టెడ్ ఏజెన్సీస్" స్థానిక కార్యాలయం. ఆ ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తున్న కాత్యాయిని మూడురోజుల క్రితం తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని కో-వర్కర్స్ "ఫేర్ వెల్ పార్టీ" ఏర్పాటుచేశారు.

"మీ రాజీనామాకు కారణం ఏమిటో అంతుబట్టటంలేదు ?" ఏకాంబరం ప్రశ్నించాడు.

"ఇంటి పనికి, ఆఫీస్ వర్క్ కి కుదరక" అంది కాత్యాయిని.

ఆ సమాధానం విన్న ఒకరిద్దరు 'అదేం కాదు. ఆఫీసంతటికీ ఒక్క తేగా ఆడపురుగు. మొగుడు ఏడుస్తున్నా డేమో' అని లోలోన అనుకున్నారు.

ఆ ఆఫీసుకు కొత్తగా మేనేజర్‌గా వచ్చిన రాజశేఖరం, కాత్యాయిని రిజైన్ చేయటం తనకెంతో బాధగా వుందని తన బాధను మాటల్లో వ్యక్తంచేశాడు.

పార్టీ ముగిసింది. కృతజ్ఞతలు తెలిపి క్రిందికి దిగివస్తున్న కాత్యాయినికి మెట్లెక్కి పైకి వస్తున్న కల్పన ఎదురయింది.

"ఎక్కడి కిలా దయచేస్తున్నావ్ ?" అంటూ ప్రశ్నించింది కాత్యాయిని.

"నీ మాటలు నామీద బాగా పని చేశాయి. కాలాన్ని దుర్వినియోగం చేయకుండా నీలా ఉద్యోగం చేయాలన్న నిర్ణయానికొచ్చాను. నీ మాటల ప్రభా వంతో. కొత్తగా ఈ ఆఫీసుకు మేనే జర్‌గా వచ్చాడు మా కజిన్ రాజశేఖరం. వాళ్ళ ఆఫీసులో టైపిస్టు రిజైన్ చేసిందంట. ఆ ప్లేస్‌లో నేను చేరు తున్నాను. సరే నీ వెక్కడికొచ్చావ్" వానిటీ బాగ్ వూపుతూ అంది కల్పన.

కాత్యాయినికి తల గిర్రున తిరిగింది.

"పనిమీద వచ్చి వెడుతున్నా" అని చెప్పి, గబగబా మెట్లు దిగింది కాత్యాయిని.